# గడ్‌చిరోలీ విప్లవోద్యమ నాయకురాలు కామ్రేడ్ సృజన అమరత్వాన్ని ఎత్తిపడదాం!
# ఆమె ఆదర్శాలను అనుసరిస్తూ విప్లవోద్యమంలో దృఢంగా పురోగమిద్దాం!!



పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో
దండకారణ్యం
సీపీఐ (మావోయిస్టు)

**కామ్రేడ్ సృజన విప్లవోద్యమ ప్రస్థానం :-**

☆ 1988 ఏప్రిల్‌లో భామ్రాగఢ్ దళంలో భర్తీ అయ్యి చిన్నక్క పేరుతో పనిచేసింది.

☆ 1988 జూలై నుండి 1991 ఆగస్టు వరకు పెరిమిలి దళంలో దళ సభ్యురాలిగా పనిచేసింది.

☆ 1990 మార్చిలో పార్టీ సభ్యురాలయ్యింది.

☆ 1991 జనవరిలో వివాహం జరిగింది.

☆ 1991 ఆగస్టు నుండి 1995 మార్చి వరకు టిప్రాగఢ్ దళంలో పార్టీ సభ్యురాలిగా పనిచేసింది.

☆ 1995 మార్చి నుండి 1997 నవంబర్ వరకు దండకారణ్యంలో ఏర్పాటు చేసిన మొదటి ప్లాటూన్‌లో పనిచేసింది.

☆ 1996 నవంబర్‌లో ప్లాటూన్ పార్టీ కమిటీ (ఏరియాకమిటీ) సభ్యురాలిగా ప్రమోట్ అయ్యింది.

☆ 1998 నవంబర్ నుండి – 2002 వరకు ఏటపల్లి దళం డిప్యూటి కమాండర్‌గా పనిచేసింది.

☆ 2002 – ఏటపల్లి దళం కమాండరయ్యింది.

☆ 2004 – డివిజనల్ కమిటి సభ్యురాలిగా ప్రమోట్ అయ్యింది.

☆ 2004 నుండి 2007 వరకు ఏరియా కమిటీ కార్యదర్శిగా, కసన్‌సూర్ (ఏటపల్లి) దళానికి ఇంఛార్జి డీవీసీఎమ్‌గా పనిచేసింది.

☆ 2009 డిసెంబర్‌లో టిప్రాగఢ్ దళానికి ఇంఛార్జ్ డీవీసీఎమ్‌గా ట్రాన్స్‌ఫర్ (బదిలీ) అయ్యింది.

☆ 2010 నుండి 2014 అక్టోబర్ వరకు టిప్రాగఢ్ ఏరియా ఇంఛార్జ్ డీవీసీఎమ్‌గా పనిచేసింది.

☆ 2009 – రీజనల్ కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ అయ్యి 2013 వరకు పశ్చిమ రీజనల్ కమిటీ సభ్యురాలిగా పనిచేసింది.

☆ 2013 మార్చి నుండి 2015 అక్టోబర్ వరకు పశ్చిమ బ్యూరో యూనిఫైడ్ కమాండ్ సభ్యురాలిగా పనిచేసింది.

☆ 2014 నుండి 2020 మే వరకు కసన్‌సూర్ ఏరియా ఇంఛార్జ్ డీవీసీఎమ్‌గా పనిచేసింది. కా.రజిత అమరత్వం తర్వాత 6 నెలల పాటు (2016 ఏప్రిల్ నుండి 2017 జనవరి వరకు) కసన్‌సూర్ ఏసీ కార్యదర్శిగా పనిచేసింది.

☆ 2017లో కసన్‌సూర్, చాముర్షీ రెండు ఏరియాల ఇంఛార్జ్‌గా పనిచేసింది. 2018లో చాముర్షీ దళాన్ని విడిగా నడపలేని స్థితిలో ఆ రెండు దళాలను/ఏసీలను కలిపి ఒకే దళంగా/ఏసీగా మార్చిన తర్వాత దాని ఇంఛార్జ్ డీవీసీఎమ్‌గా పనిచేసింది.

☆ 2019 అక్టోబర్ నుండి కసన్‌సూర్ ఏసీ కార్యదర్శిగా, ఆ ఏరియా ఇంఛార్జ్ డీవీసీఎమ్‌గా పనిచేసింది.

☆ 2020 మే 2 నాడు కసన్‌సూర్ ఏరియా సీన్‌బట్టి వద్ద పోలీసులను ప్రతిఘటిస్తూ అమరురాలయ్యింది.

## గఢ్‌చిరోలీ విప్లవోద్యమ నాయకురాలు కామ్రేడ్ సృజన అమరత్వాన్ని ఎత్తిపడదాం!

## ఆమె ఆదర్శాలను అనుసరిస్తూ విప్లవోద్యమంలో దృఢంగా పురోగమిద్దాం!!

మే 2, 2020 గఢ్‌చిరోలీ విప్లవోద్యమ చరిత్రలో, పీడిత జనవిముక్తి–మహిళా విముక్తి పోరాట మార్గంలో తీవ్ర విషాదం నిండిన రోజు. ఆరోజు ఉత్తర గఢ్‌చిరోలీ డివిజనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ సృజన ఏటపల్లి తాలుకాలలోని పేంఢ్రి పోలిస్‌స్టేషన్ పరిధిలోని సీన్‌బట్టి వద్ద సీ–60 కమాండోలతో అత్యంత సాహసికంగా తలపడుతూ తన వెంట వున్న కామ్రేడ్స్‌ను కాపాడుతూ తాను వీరమరణం పొంది, అమరురాలైంది. ఆమె అమరత్వంతో భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమం ఒక సీనియర్ మహిళా కామ్రేడ్‌ను కోల్పోయింది. దండకారణ్యం ప్రజా ఉద్యమం మట్టి పొరలలో నుండి తొలుచుకుని పుట్టిన భూమి పుత్రికను కోల్పోయింది. నాలుగు దశాబ్దాల గఢ్‌చిరోలీ విప్లవోద్యమం 32 సంవత్సరాల సుదీర్ఘ పోరాట అనుభవం కలగిన ఆర్.సీ. స్థాయి నాయకత్వాన్ని నష్టపోవడమే కాకుండా, ప్రజల, కేడర్ల అపార విశ్వాసాన్ని చూరగొన్న తొలితరం మహిళా కామ్రేడ్‌ను కోల్పోయింది. పశ్చిమ సబ్‌జోన్ ఉద్యమ చరిత్రలో ఒక అధ్యాయానికి ప్రాతినిధ్యం వహించిన ప్రియమైన కామ్రేడ్‌ను నష్టపోయింది. ఆ కామ్రేడ్ స్మృతిలో పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తోంది. ఆమె అసంపూర్ణ ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామని శపథం చేస్తోంది.

గత 32 సంవత్సరాలుగా గఢ్‌చిరోలీ (పశ్చిమ బ్యూరో) విప్లవోద్యమ పురోగమనం కోసం కామ్రేడ్ సృజన చేసిన కృషి చిరస్మరణీయం. గఢ్‌చిరోలీ ఉద్యమ నిర్మాణంలో, ఉద్యమ ఎగుడు–దిగుళ్ళల్లో, ప్రతి మలుపులో ఆమె పాత్ర పెనవేసుకపోయింది. ఆ విప్లవోద్యమంలో ఆమె కృషికి ఎంతో ప్రాధాన్యత వుంది.

దీర్ఘకాలంగా విప్లవోద్యమ పురోగమనం కోసం ఆమె చేసిన కృషిని తెలుసుకుందాం. ఆమె ఆదర్శాలను అనుసరిద్దాం.

**కామ్రేడ్ జైని ఆర్కె జీవితపు తొలిరోజులు :**

50 సంవత్సరాల కిందట భామ్రాగఢ్ తాలుకాలోని గోపనార్ గ్రామంలో ఆర్కె/అరికె దంపతులకు రెండో సంతానంగా ఆమె జన్మించింది. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన పేరు జైని. ఆమె తండ్రి చైతు ఆర్కె, తల్లి శుక్రీబాయి ఆర్కె. ఆమెకు ఒక అన్నా, చెల్లీ వున్నారు. ఆదివాసి అమ్మాయిలందరి లాగే ఆమె బుద్ధెరిగినప్పటి నుండి ఇంటి పనుల్లో, వ్యవసాయ పనుల్లో, అడవి ఉత్పత్తుల సేకరణలో కష్టపడి, చురుగ్గా పనిచేసేది. సీజనల్‌గా జరిగే తునికాకు కోత, వెదురు నరికే కూలీ పనుల్లో కూడా పాల్గొనేది. ఆర్కె కుటుంబానికి తగినంత భూమి వుండడంతో పాటు ఇంట్లోని వారంతా కష్టపడి వ్యవసాయ పనులు చేయడంతో మధ్యతరగతి కుటుంబంగా జీవనం గడిపేవారు.

ఆనాడు గ్రామాల్లో ప్రజలపై ఆదివాసీ తెగ పెద్దల పెత్తనం, అక్రమాలు కొనసాగేవి. ఆదివాసీ తెగ పితృస్వామ్యం మహిళలను అణచివేసేది. ఈ స్థితిలో 1980 మధ్య భాగానికి సిరొంచ మీదుగా విప్లవోద్యమం గఢ్‌చిరోలీలోకి ప్రవేశించి అనతి కాలంలోనే 1984 నాటికి భాంమ్రాగఢ్, జారవండి ప్రాంతాలకు సైతం విస్తరించింది. 1984 ఫిబ్రవరిలో భాంమ్రాగఢ్ దళం నిర్మాణమయ్యి భాంమ్రాగఢ్, గట్ట ప్రాంతాల్లో విప్లవోద్యమ నిర్మాణానికి కృషిని ఆరంభించింది.

అడవి ప్రాంతాల్లో ఫారెస్టు, రెవెన్యూ, ఆబ్కారీ డిపార్ట్‌మెంట్లు ఆదివాసులపై సాగించే దోపిడీ, పీడన, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, భూస్వామ్య, దళారీ పెట్టుబడిదార్ల, సామ్రాజ్యవాద దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా మన దళాలు ప్రజలను చైతన్యవంతం చేస్తూ, సంఘటితం చేయడానికి రాజకీయ, పోరాట, నిర్మాణ కృషిని చేపట్టాయి. 'అడవిపై ఆదివాసులకే అధికారం', 'దున్నే వారికే భూమి' అనే నినాదాలతో ప్రజలను పోరాటాలకు సిద్ధం చేసేవి. ఈ క్రమంలో మొదట ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కు, తునికాకు టేకేదార్లకు వ్యతిరేకంగా భాంమ్రాగఢ్ ప్రాంతంలో కూడా పోరాటాలు జరిగాయి.

మాటా-పాటల ద్వారా విప్లవ రాజకీయాల ప్రచారం, ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కు, తునికాకు టేకేదార్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటాల ద్వారా మన దళాలు ఆదివాసీ ప్రజల ప్రేమాభిమానాల్ని సంపాదించుకున్నాయి. దీంతో ఆదివాసీ తెగపెద్దల, పెత్తందార్ల పెత్తనం, అక్రమాలు గురించి, మహిళలపై ఆదివాసీ తెగ పితృస్వామ్యపు పీడన, అణచివేతల గురించి ప్రజలు మన దళాలతో చర్చించి వాటి నుండి విముక్తిని కోరుకునేవారు. ఆనాటి ఈ రాజకీయ వాతావరణం సృజనను, సృజన కుటుంబాన్ని ఉద్యమానికి అనుకూలంగా ప్రభావితం చేసింది.

**ఆదివాసి తెగ పితృస్వామ్యంపై తిరుగుబాటు జెండానెగరేసిన చిన్నక్క :**

చైతు ఆర్కె కుటుంబం కష్టపడి ఆర్థికంగా మెరుగుపడడాన్ని ఓర్వలేని గోపనార్ గ్రామ పెత్తందార్లు చైతు కుటుంబంపై చేతబడి (ఓదే) చేస్తారని ఆరోపించారు. ఈ సమస్యను చైతు మన దళానికి చెప్పుకోగా, ఇలాంటి తప్పుడు ఆరోపణలతో రైతాంగాన్ని వేదించవద్దని పెత్తందార్లకు హెచ్చరించి పరిష్కరించింది. దీంతో విప్లవ కార్యకర్తలు చైతు కుటుంబానికి ఆప్తులయ్యారు. మనదళం ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టే క్రమంలో గోపనార్ గ్రామంలోని యువతీయువకులు గెరిల్లా దళంలోకి భర్తీ కావటానికి సిద్ధమయ్యారు. ఎపుడయితే జైని యుక్తవయస్సులోకి ఎదిగి, దళంలోకి పోవడానికి సిద్ధపడిందో వెంటనే తన తల్లిదండ్రులు ఆమెను తమ పుటుల్ (మేనరికం) వారికిచ్చి పెళ్లి చేశారు. ఇష్టంలేని పెండ్లిని వ్యతిరేకించిన జైని తన తల్లిదండ్రులను వ్యతిరేకించి, అత్తమామల ఇంటిని వదిలి బంధువుల వద్ద కొంతకాలం గడిపింది. తనకు పెళ్ళి ఇష్టం లేదని చెప్పినా వినకుండా పెళ్ళి చేయడమే కాకుండా, ఆ పెళ్ళిని వ్యతిరేకించి బంధువుల వద్దకు వెళ్ళిన తనను తిరిగి

మేనవాడికి అప్పగించడం కోసం తన తల్లిదండ్రులు, ఊరి పెద్దలు చేసిన ప్రయత్నాలతో ఆదివాసీ తెగ పితృస్వామ్యపు పీడనను జైని అర్థం చేసుకోగలిగింది. మన దళాల ప్రవేశానికి ముందు ఇష్టంలేని పెళ్ళిళ్ళతో కొంతమంది యువతులు అయిష్టంగానే సంసారం చేసిన, తమ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని, స్వాభిమానాన్ని కాపాడుకునే కొందరు ఆత్మహత్యలు చేసుకునేవారు. జైని అయిష్టంతో సంసారం చేయడానికి సిద్ధపడలేదు, తన సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదనుకుంది. చివరికి గెరిల్లా దళాల్లో చేరిపోవడమే సరైన మార్గమనుకుంది. దీంతో ఇష్టంలేని పెళ్ళి చేసిన తన తల్లిదండ్రులను, అత్తమామలను, తెగ పెద్దలను వ్యతిరేకించి తెగ పితృస్వామ్యంపై తిరుగుబాటు జెండానెత్తిన చిన్నక్కగా దళంలో 1988 ఏప్రిల్‌లో భర్తీ అయ్యింది. స్వేచ్ఛా, స్వతంత్రత, స్వాభిమానాల్ని ఆకాంక్షించే ఆదివాసీ యువతులకు పోరుదారిని చూయించే పోరాట జెండా అయ్యింది.

**అలుపెరుగక, దృఢంగా, విశ్వసనీయంగా పనిచేసే సమర్థవంతమైన ఆర్గనైజర్ :**

కామ్రేడ్ సృజన ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ అయిన 1996 నవంబర్ నుండి అమరురాలయిన 2020 మే వరకు 23 ఏళ్ళ కాలంలో ఏరియా కమిటీ, డివిజనల్ కమిటీ సభ్యురాలిగా దీర్ఘకాలం పాటు ప్రజలను విప్లవోద్యమంలో సమీకరించి, ప్రజా నిర్మాణాల్లో, స్థానిక నిర్మాణాల్లో సంఘటితం చేసింది.

ప్రతి సంవత్సరం తునికాకు కోత, వెదురు నరికే పనుల్లో కూలీరేట్ల పెంపుదల కోసం ప్రజలను సమీకరించి పోరాటాలు చేయించింది. గ్రామాల్లోని ప్రజా వ్యతిరేక తెగ పెద్దలకు, పెత్తందార్లకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు చేయించింది.

ప్రజలను విప్లవ రాజకీయాలతో చైతన్యవంతం చేస్తూ వారిని ప్రజా సంఘాల్లో, ప్రజా మిలీషియాలో, పార్టీ సెల్స్, గ్రామ పార్టీ కమిటీ (జీపీసీ), జనతన సర్కార్లో సంఘటితం చేసింది. ఈ కాలమంతా శత్రు దాడులతో దెబ్బతిన్న ప్రజా నిర్మాణాలను అలుపెరగకుండా, దృఢంగా పునర్నిర్మాణం చేస్తూ వచ్చింది.

2001లో జరిగిన మనపార్టీ కాంగ్రెస్ గైడెన్స్‌ను అనుసరించి విప్లవ ప్రజా కమిటీల (ఆర్‌పీసీల) నిర్మాణానికి ప్రారంభమైన కృషిలో కామ్రేడ్ సృజన చొరవ పట్టుదలతో కృషి చేసింది. ఏరియా కమిటీ కార్యదర్శిగా అనివార్యమైన పరిస్థితుల్లో దళ కమాండర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తూ ఆమె ఎంతో ఉత్సాహంగా జనతన సర్కార్ల నిర్మాణ కృషిలో పాల్గొంది. గఢ్‌చిరోలీలో నెలకొన్న స్థలకాల పరిస్థితులపై ఆధారపడి ఏఆర్‌పీసీలను (ఏరియా జనతన సర్కార్లను) నిర్మించాలని ఎస్‌జెడ్‌సీ ఇచ్చిన గైడెన్స్ వెలుగులో కసన్‌సూర్ ఏఆర్‌పీసీని నిర్మించి, పని చేయించడంలో సృజన కీలక పాత్ర పోషించింది. టిప్రాగఢ్ ఏఆర్‌పీసీని పనిచేయించడంలో కూడా సృజన కీలకంగా పనిచేసింది. ఏరియా ప్రభుత్వాలను, వాటి రక్షణకై ప్రజా మిలిషియాను, సెకండరీ బలగాలను సమన్వయ

పరుస్తూ ప్రజల వ్యవసాయ కార్యకలాపాల మెరుగుదలకు తీవ్రంగా కృషి చేసింది.

దీర్ఘకాలంగా మాస్‌వర్క్ చేస్తూ అనుభవం గడించినప్పటికీ తను చేసిన కృషి గురించి ఏనాడు అతిశయోక్తులు చెప్పుకోలేదు. జనతన సర్కార్ల నిర్మాణం సందర్భంగా, గ్రామ సభల నిర్మాణం సందర్భంగా, ఇతర రాజకీయ విషయాల్లో తనకు తెలియని విషయాలను తెలవదని స్పష్టంగా చెప్పి వాటి గురించి తెలిసిన కామ్రేడ్స్ నుండి, పై కమిటీ కామ్రేడ్స్ నుండి తెలుసుకునేది. తెలవని విషయాలను గురించి తెల్సుననే బేషజానికి పోలేదు. తను ఏ మేరకు పనిచేసేదో ఆ మేరకే పార్టీ కమిటీల్లో రిపోర్టులు చెప్పేది. తెలియని విషయాలు తెల్సుకునేది. ఈ రకంగా పార్టీకి విశ్వసనీయమైన ఆర్గనైజర్‌గా వుండింది.

తెరపిలేని శతృదాడుల మధ్య, బూటకపు ఎన్‌కౌంటర్లలో శతృవు స్థానిక నిర్మాణాల కామ్రేడ్స్‌ను చంపివేసినపుడు, అక్రమ అరెస్టులతో, చిత్రహింసలతో ప్రజలను, స్థానిక నిర్మాణాల కామ్రేడ్స్‌ను భయోత్పతానికి గురిచేసినపుడు కొత్త నిర్మాణాలు చేయడమైనా, వాటిని పునర్నిర్మించడమైనా వాటిని సమావేశపరచి, సమన్వయిస్తూ, పని చేయించడమైనా అత్యంత కష్టమైనదిగా మారుతుంది. ఇలాంటి స్థితిలో ప్రజా నిర్మాణాలను నిర్మిస్తూ, పునర్నిర్మిస్తూ పని చేయించడం ఆమె సమర్థతకు నిదర్శనం.

కార్పెట్ సెక్యూరిటీ విస్తరించి, బలపడుతున్న స్థితిలో రహస్య, చట్ట వ్యతిరేక నిర్మాణాలకే పరిమితమయితే అశేష ప్రజానీకాన్ని విప్లవోద్యమంలో సమీకరించలేమనే అవగాహనతో ఎస్‌జెడ్‌సీ ఇచ్చిన గైడెన్స్‌తో గఢ్‌చిరోలీలో 2013–14 నుండి నూతన చట్టపర నిర్మాణాలరు పూనుకున్నపుడు అక్కడి డీవీసీలు బ్యూరోవ్యాప్తంగా అనేక గ్రామాల్లో వాటిని నిర్మించాయి. ఒకవైపు ప్రజలను రహస్య, చట్టవ్యతిరేక నిర్మాణాల్లో సంఘటితం చేస్తూనే విశాల ప్రజారాశులను బహిరంగ, చట్టబద్ధ నిర్మాణాల్లో సమీకరించడానికి అవి ఉపయోగపడ్డాయి. కసన్‌సూర్ ఏరియాలోని ఎన్నో గ్రామాల్లో కామ్రేడ్ సృజన వాటిని నిర్మించి, పని చేయించింది.

కార్పెట్ సెక్యూరిటీ మధ్య ప్రజలను విప్లవోద్యమంలో సమీకరించడంతో పాటు వారితో, స్థానిక నిర్మాణాలతో సజీవ సంబంధాలు కలిగివుండేలా వారికి రాజకీయ గైడెన్స్‌నందించేలా స్థానిక పార్టీ సభ్యుల్లో కొంతమందిని పూర్తికాలం కార్యకర్తలుగా తయారు చేసే కృషిలో భాగంగా ఆమె నాయకత్వంలో ఏసీ కొంతమందిని పూర్తికాలం కార్యకర్తలుగా తయారు చేసుకుంది. తాను పనిచేసిన కసన్‌సూర్, టిప్రాగఢ్ ఏరియాల్లో అనేకమంది పార్టీ, పీఎల్‌జీఏలోకి భర్తీ కావడంలో ఆమె పాత్ర ప్రధానమైనది.

**చావుకు వెరవని సాహసిక గెరిల్లా :**

సృజన విప్లవ జీవితం నిరంతర శతృదాడుల మధ్య, వాటిని ఎదుర్కొంటూ, ప్రతిఘటిస్తూ సాగింది. 32 ఏళ్ల విప్లవ జీవితంలో శతృ ఫైరింగ్‌లు, ఎన్‌కౌంటర్లు లేకుండా గడిచిన సంత్సరాలు

చాలా తక్కువ.

1997కు ముందు తమ దళంపై తామున్న బలగాలపై ఆవరేజ్‌గా (సగటుగా) 2 ఏళ్లకు ఒక ఫైరింగ్ జరిగితే, 1997 నుండి గడిచిన 23 ఏళ్లల్లో ఆవరేజ్‌గా సంవత్సరానికి ఒక ఫైరింగ్ జరగ్గా, కొన్నిసార్లు సంవత్సరంలో 2-3 ఫైరింగ్‌లు కూడా జరిగాయి.

1989లో గట్ట రేంజ్‌లోని ఆల్‌వాడ వద్ద జరిగిన ఫైరింగ్ తను ఎదుర్కొన్న మొదటి ఫైరింగ్, 1992లో టిప్రాగఢ్ ఏరియాలోని కోవేడోహలో (జూన్‌లో), గట్టనేలిలో, 1993 జూలైలో సిందేసూర్‌లో, 1994లో గూరేకస్సలో, చక్రిఘాట్ దగ్గరి గ్రామంలో, మురుంగాం రేంజ్‌లోని ... గ్రామంలో ఫైరింగ్‌లు జరిగాయి. 1995లో పెరిమిలి రేంజ్‌లోని తుమిరికస్సలో, 1996లో తను ప్లాటూన్‌లో భాగంగా ఉత్తర బస్తర్ ప్రతిఘటనకు వెళ్ళినపుడు అక్కడ తమ ప్లాటూన్‌పై ఫైరింగ్ జరిగింది.

1998 నుండి 2020 మే వరకు తాను ఎదుర్కొన్న కాల్పులకు వస్తే 1998లో పొట్టావీ జెవెల్లీ, తామడ, చందన్‌పల్లి, గడ్డేవాడ, గజమేడి, బొట్టేఝురి, అంబేఝురి, హెట్టడ్‌కస్స, చోటజలియ, చాముర్షీ ఏరియాలోని జడ్డ అడవిలో, సూర్జాగడ్ గుట్టలకు ఆనుకుని వున్న నేందువాడి వద్ద, తాండవాయిలో (2002), కసన్‌సూర్ ఏరియాలో కచ్చ్‌లేర్‌లో (2003 జూన్), వెడ్మాగఢ్‌లో (2004 జూన్), పైడిటోల (2004 సెప్టెంబర్), మానెవారలో (2005), సిందేసూర్ (2013 ఏప్రిల్‌లో), 2014లో కసన్‌సూర్ ఏరియా డీఏకేఎమ్ఎస్ మహాసభపై జరిగిన ఫైరింగ్, నవేగావ్‌లో (2015 నవంబర్), తోకజేవెల్లి (2015), కార్కటోలలో (2016 మార్చి), తోకజేవెల్లిలో (2016 జూన్), రేకనార్ (2017), గొటన్‌కార్క (2018ఫిబ్రవరి), వెడంపైలీ (2018), పైడి-ఇర్పగుట్ట (2018 మే), పిపిలీ బూర్గిలో (2018 జూలై), కుండుంలో (2019), కొట్మీలో (2019 జూలై), బోదినీ (2019 సెప్టెంబర్), గాంగినీలో (మార్చి), సీన్‌బట్టి (మే) ఫైరింగ్‌లు జరిగాయి.

ఈ రకంగా 30కి పైగా ఫైరింగ్‌లను ఎదుర్కొనగా, దాదాపు 20-25 ఫైరింగ్‌లు ప్రజల మద్దతుతో, తమ అలర్ట్‌నెస్‌తో తృటిలో తప్పిపోయాయి. చివరికి మే 2, 2020 నాడు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో సీన్‌బట్టి వద్ద జరిగిన ఫైరింగ్‌లో తన దళ సభ్యులను కాపాడడానికి ఆత్మ త్యాగానికి సిద్ధపడి తను శత్రువును సాహసోపేతంగా ప్రతిఘటించి అమరురాలయ్యింది.

1991-94 మధ్యకాలంలో గఢ్‌చిరోలీ విప్లవోద్యమ చరిత్రలో అత్యంత కష్టకాలం. అది, మహారాష్ట్ర ప్రభుత్వం గఢ్‌చిరోలీ విప్లవోద్యమ నిర్మూలన కోసం ప్రత్యేక పథకాన్ని రూపొందించి అమలుచేసిన కాలం. మన స్థానిక నిర్మాణాల నుండి మొదలుకొని పార్టీ, గెరిల్లా బలగాల సభ్యులను నిర్దిష్టంగా గుర్తించి, ఒక్కొక్కరిని ఏరివేసే లక్ష్యంతో శత్రువు ఐడెంటిఫికేషన్ (ఆయా వ్యక్తులను నిర్దిష్టంగా గుర్తించడం), ఐసోలేషన్ (ప్రజల నుండి పార్టీని, గెరిల్లాలను వేరుచేయడం), లిక్విడేషన్

(పార్టీని, గెరిల్లాలను, స్థానిక నిర్మాణాల్లోని సమరశీల శక్తులను నిర్మూలించడం) పేరుతో ఫేజ్‌ల వారీ పథకాన్ని అమలుచేశాడు. ఆ కాలంలో గఢ్‌చిరోలీ, భండారా జిల్లాల్లో శత్రువు దాదాపు 2-3 వేలమంది ప్రజలను, స్థానిక నిర్మాణాల వారిని అక్రమంగా అరెస్టు చేసి, ఫాసిస్టు 'టాడా' చట్టం కింద జైళ్ల పాల్జేశారు. ఈ రెండు జిల్లాల్లో దాదాపు 60-70 మందిని బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేశాడు, కొంతమందిని మాయం చేశాడు. అంతకుముందు కూడా గఢ్‌చిరోలీ ఉద్యమ అణచివేత కోసం శత్రువు తీవ్రమైన దమనకాండను కొనసాగించినప్పటికీ, 1991-94 దాడి వాటన్నింటిని కంటే తీవ్రంగా కొనసాగిన ప్రత్యేకదాడి. దీంతో టిప్రాగఢ్ దళ కమాండర్ రాంలాల్ సహా కొంతమంది దళ సభ్యులు పారిపోయారు. ప్రజల్లో, స్థానిక నిర్మాణాల్లో తీవ్రమైన భయాందోళనలు ఏర్పడ్డాయి శత్రుదాడితో ఇన్‌ఫార్మర్లు తయారయ్యారు. ప్రజా వ్యతిరేకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాల్ని తీవ్రతరం చేశారు. ఈ స్థితిలో ప్రజలు, మన పార్టీ ముందు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. సంఘాల్లో పనిచేయడానికే కాక పోరాట కమిటీల్లో పనిచేయడానికి కూడా సిద్ధపడేవారు కాదు. సంఘాల్లో పనిచేయడమంటే శత్రుదాడిలో ప్రాణాలు కోల్పోవడానికి సిద్ధపడడమే. ఈ స్థితిలో ప్రజలను, స్థానిక నిర్మాణాల వారిని రాజకీయంగా చైతన్యవంతం చేయడం, ఇన్‌ఫార్మర్లను, ప్రజా వ్యతిరేకులను అణచివేయడం, పార్టీ, గెరిల్లా బలగాలను కాపాడుకోవడానికి గెరిల్లా యుద్ధ నియమాలను కచ్చితంగా అమలుచేయడం అనే ప్రత్యేక పథకంతో ఆనాడు అక్కడ మన పార్టీ పనిచేసింది.

"చదువు సంధ్యలు రాని ఆదివాసీలతో పోరాటం చేస్తే ఏం ఉపయోగం? చదువుకున్న వాళ్ళతో పోరాటం చేస్తే మంచిది", "అడవిలో పోరాటం చేస్తే ఏం ఉపయోగం? బొంబాయి లాంటి పట్టణాల్లో పోరాటాలు చేయండి", "పోలీసులకు వ్యతిరేకంగా యుద్ధం చేయాలని చెపుతూనే పోలీసులు వస్తే మీరు ఎందుకు తప్పుకుంటున్నారు", "తుపాకులు పట్టి పోరాడడం కంటే ఎన్నికలలో నిలబడవచ్చు కదా". "రాంలాల్ వెళ్లిపోయిండు, మీరు కూడా వెళ్లిపోతరు కావచ్చు" వగైరా ప్రశ్నలు శత్రుదాడి తీవ్రతతో ప్రజలు మన ముందుంచారు. అవన్నీ మన రాజకీయ, మిలిటరి పంథాకు సంబంధించినవి. అంటే వర్గపోరాటంలో ప్రధానంగా రైతాంగం పైన, ఆదివాసులపైన ఆధారపడడమా? లేక విద్యార్థులపైననా? అడవులు, కొండలు-గుట్టలు కలిగిన వ్యూహాత్మక ప్రాంతాల్లో నుండి ప్రజాయుద్ధాన్ని ప్రారంభించడమా? పట్టణాల నుండా? ఎన్నికల మార్గమా? ప్రజాయుద్ధ మార్గమా? పోలీసులను ఎదుర్కోవడం గెరిల్లాయుద్ధ పద్ధతిలోనా? ఎదురు బొదురుగా నిలబడి యుద్ధం చేయటమా? అనేవి ప్రజల ప్రశ్నల సారాంశం. కాబట్టి మన రాజకీయ, మిలిటరి పంథా (వ్యూహం-ఎత్తుగడల)ను ప్రజలకు అర్థమయ్యే భాషలో, సరళంగా వారికి అర్థం చేయిస్తూ రెండేళ్ళ పాటు ఒక రాజకీయ క్యాంపెయిన్‌ను నడిపాం. ఇన్‌ఫార్మర్ల నియంత్రణ కోసం రెండునెలల ప్రత్యేక

కార్యక్రమం తీసుకున్నాం. మన బలగాల రక్షణ కోసం మన ప్రయాణం, డేరాలు వేయడం, సప్లయ్‌లు తెచ్చుకోవడం వగైరాలన్నింటిలో రహస్యం, వేగం, దృఢసంకల్పం, నిరంతర అప్రమత్తత, స్థల మార్పిడి లాంటి గెరిల్లాయుద్ధ నియమాలను ప్రత్యేక శ్రద్ధతో అమలుచేశాం. గ్రామాలలో ఒక్కొక్కరిని సిద్ధం చేస్తూ కనీసం ముగ్గురు సిద్ధపడ్డచోట రహస్య సంఘాన్ని నిర్మాణం చేస్తూ, ఎంపిక చేసిన కొంతమందికి పార్టీ సభ్యత్వం ఇచ్చే కార్యక్రమం తీసుకున్నాం. మరోవైపు పోలీసు బలగాలపై భీమన్‌కొజ్జి లాంటి ఆంబుష్‌లు ప్రారంభించాం. అంటే ఆనాటి శత్రుదాడిని ఎదుర్కోవడానికి మనం ప్రత్యేకమైన రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి కొనసాగించాం. ఈ కృషి అంతటిలో కామ్రేడ్ సృజన చురుగ్గా, ధైర్యంగా వుంటూ చైతన్యవంతమైన కష్ట భూయిష్టమైన కృషి చేస్తూ భాగస్వామి అయ్యింది. రాంలాల్ లాంటి వాళ్ళు వెళ్ళిపోయినప్పటికీ రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి ద్వారా పార్టీ పీడిత ప్రజలకోసం పోరాడుతుందనే విశ్వాసాన్ని ప్రజల్లో నెలకొల్పాం. ఆనాటి కృషి ద్వారా రహస్య ప్రజాసంఘాల నిర్మాణం, రహస్య పార్టీ నిర్మాణం, కష్టకాలాల్లో ప్రజలను, స్థానిక నిర్మాణాలను మన రాజకీయ, మిలిటరి పంథాపై, చైతన్యవంతం చేయడం, ఇన్‌ఫార్మర్లను నియంత్రించడం, రోజువారీ జీవితంలో, యుద్ధ చర్యల్లో గెరిల్లాయుద్ధ నియమాలను ఆచరించడం ఎలా వుంటుందనే విషయాలను నిర్దిష్ట అనుభవం ద్వారా కామ్రేడ్ సృజన నేర్చుకున్నది. ఆ అనుభవాలతో పాటు ఎప్పటికపుడు పార్టీ అందించే రాజకీయ, మిలిటరి శిక్షణతో పాటు తానే స్వయంగా నాయకత్వం వహించి నడుపుతున్న ఉద్యమం నుండి పొందిన అనుభవాలతో ఆమె తన రాజకీయ, నిర్మాణ, సైనిక స్థాయిని పెంచుకుంటూ వచ్చింది.

పోలీసు ఇన్‌ఫార్మర్లను వేర్వేరు పద్ధతుల్లో నియంత్రిస్తూనే అవసరమైన చోట కొంతమందిని నిర్మూలించిన ఘటనల్లో సృజన పాల్గొంది, కమాండింగ్ చేసింది.

విప్లవోద్యమంపై శత్రువు సాగించే దాడిని ప్రతిఘటించడం కోసం పార్టీ చేపట్టిన ప్రతిఘటన చర్యల్లో, టీసీఓసీల్లో సృజన ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంది. కొన్నింటిలో సభ్యురాలిగా, సెక్షన్ డిప్యూటీగా, సెక్షన్ కమాండర్‌గా, ప్లాటూన్ డిప్యూటీగా పాల్గొంది. భీమన్‌కొజ్జి (1992), మేడిపల్లి (1995), బంజారిఘాట్ (1996), రడంపల్లి–చల్వాడ (1997), నేందువాడి–కండి (1997), రొప్పి, కొత్తకొండ–గోడ్సూర్ (1998), చాత్‌గావ్–గట్ట ( 2006), పుల్‌బొడ్డి–పూన్‌టోల, గట్టా–జామిడిజోర ఆంబుష్‌లతో పాటు 2010లో హోతిగోటా వద్ద 16 టన్నుల పేలుడు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్న ఘటనలో కూడా పాల్గొంది. టీసీవోసీ చేపట్టిన ప్రతి సంవత్సరం తాను కమాండ్‌లో భాగమయ్యి శత్రు సమాచార సేకరణ, రెక్కీలో, ప్లానింగ్‌లో పాల్గొని టీసీవోసీ విజయానికి కృషి చేసింది.

తన జీవిత కాలంలో అనేక పోలీసు ఫైరింగులను ఎదుర్కొన్నా, మరెన్నింటి నుండో తృటిలో

తప్పుకున్న సృజన ఏనాడు శత్రు దాడులకు, చావుకు భయపడలేదు. కార్పెట్ సెక్యూరిటి విస్తరించి, ఇన్‌ఫార్మర్ల సమస్య పెరిగి ఒక్కో సంవత్సరం రెండు-మూడు ఫైరింగులు జరుగుతూ మరో రెండు-మూడు ఫైరింగ్‌లు తప్పిపోతున్న స్థితిలో 2017 నుండి తన జీవిత సహచరున్ని కలిసి విడిపోయే సందర్భాల్లో "మళ్లీ కలుస్తామో లేదో"నంటూ ఉద్వేగభరిత వీడ్కోలు పలికేదే కానీ, ఏరియాలోకి వెళ్ళి ప్రజల్లో పని చేయడానికి (మాస్‌వర్క్) ఏనాడు వెనుకాడలేదు. ఏరియాలో పనిచేసే క్రమంలో పోలీసు ఫైరింగ్‌లు తప్పవనీ, అందులో ఎపుడో ఒకసారి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందనే స్పష్టతతోనే ఆమె ప్రజలను అంటిపెట్టుకుని పనిచేసి 'చావుకు వెరవని సాహసిక గెరిల్లా'గా అమరురాలైంది.

**విప్లవ రాజకీయాలు బోధించిన టీచర్:**

బాల్యంలో అక్షరాభ్యాసానికే నోచుకోని కామ్రేడ్ జైనీ, విప్లవోద్యమంలోనే ప్రాథమిక విద్యను అభ్యసించి పార్టీ ప్రతికలు, సర్క్యులర్‌లు, దస్తావేజులు చదివి అర్థం చేసుకోవడం, ప్రజా నిర్మాణాలకు బోధించడంలో ఆమె ఎంతో ఆసక్తి కనపర్చేది. మరోవైపు గ్రామీణ యువతలో చదువు సంధ్యలు పెరిగి ఉన్నత చదువులు చదివిన (విప్లవ కుటుంబాల)వారిని వివిధ ప్రజా నిర్మాణాలలో సంఘటితపరిచిన్పటికీ, వారికి ఆయా సెక్షన్‌ల సామాజిక సమస్యలపై విప్లవ రాజకీయాలను అన్వయిస్తూ రాజకీయ బోధన గరపడానికి వినూతన రూపాలలో కృషి సలిపింది. తనకు తెలియని విషయాలను సోదర కామ్రేడ్స్ నుండి తెలుసుకోవడంలో, వారితోనే ఆ పనులను పూర్తి చేసుకునే విధంగా అందరి సహాయ సహకారాలతో ఉద్యమ అవసరాలను తీర్చడంలో ఆమె నూతన వరవడికి మార్గం చూపింది. మరోవైపు పార్టీ చేపట్టిన 'నాయకత్వ ప్రశిక్షణ కోర్సు'లో పాల్గొంటూ తన రాజకీయ సిద్ధాంత జ్ఞానానికి పదునుపెట్టుకునేది. తన దీర్ఘకాలిక విప్లవాచరణ-అనుభవం ద్వారా, పార్టీ అందించే సైద్ధాంతిక-రాజకీయ, నిర్మాణ, సైనిక శిక్షణ ద్వారా తన సైద్ధాంతిక-రాజకీయ, నిర్మాణ సైనిక స్థాయిని పెంచుకుంటూ తను ఇంచార్జిగా వున్న ఏరియాల్లోని పార్టీ, పీఎల్‌జీఏ కాడర్లకు బలగాలకు తానే టీచర్‌గా వుండి అనేక విషయాలపై క్లాసులు చెప్పింది.

**పితృస్వామ్య వ్యతిరేక పోరాటంలో:**

కామ్రేడ్ సృజన పితృస్వామ్య వ్యతిరేక పోరాటంలో ముందుండేది. ఏ రూపంలో ఎదురైనప్పటికీ పురుషాధిక్యతను ఖండిస్తూ, స్త్రీ-పురుష సమానత్వం కోసం సంఘర్షించేది. దండకారణ్య వ్యాప్తంగా ఉన్న సీనియర్ మహిళలను సమీకరించి పార్టీ నడిపిన మహిళా ప్రత్యేక సమావేశాలలో ఆమె ఎంతో ఉత్సాహంగా పాల్గొనేది. అలాగే డివిజన్‌లో, సబ్-జోన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశాలలో ఆమె అనేకసార్లు పాల్గొంది. 2017లో జరిగిన రెండు సబ్ జోన్‌ల (ఉత్తర, పశ్చిమ) ప్రత్యేక మహిళా సమావేశంలో పాల్గొని వచ్చి, 2018లో డివిజన్‌లో జరుపుకున్న ప్రత్యేక మహిళా

సమావేశంలో రష్యా, చైనా విప్లవ మహిళల అనుభవాలను బోధించింది. ఆదివాసీ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారిని సంఘటిత పర్చడంలో ఎదురవుతున్న పితృస్వామ్య ఆటంకాలను, విప్లవోద్యమంలో మహిళా సహచరులు ఎదుర్కొంటున్న సమస్యలు లోతుగా, తన అనుభవం నుండి సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఆమె ఎంతో కృషి చేసింది. తాను కొంతకాలం దండకారణ్య మహిళా సబ్ కమిటీలో సభ్యురాలై వాటి పరిష్కారానికి సమష్టిలో భాగంగా మార్గాలు ఆలోచించి ఆచరణలో తాను మార్గదర్శకం చేసింది. ఉద్యమంలోని మహిళలకు ఒక సీనియర్ మహిళగా అండగా ఉంటూ వారికి ఉద్యమంలో ఎదురయ్యే సమస్యలపై సరైన రాజకీయ అవగాహన కల్పిస్తూ మహిళా సమస్యలు సామాజిక సమస్యలంటూ, సమాజంలో దోపిడీ, అణచివేతలు, అసమానతల తొలగింపుకు కృషి చేస్తూ మహిళా విముక్తికి మార్గం సుగమనం చేసుకోవాలని బోధించే పార్టీ దృష్టికోణాన్ని వారికి అందించేది.

**కమ్యూనిస్టు జీవనశైలిని-మావోయిస్టు పనిశైలిని ఆచరించిన ఆదర్శనీయురాలు :**

తన జీవితకాలమంతా ఆమె ఆర్థిక దుబారకు పాల్పడకుండా, ఆడంబరాలకు పోకుండా సీదాసాదా జీవనం గడిపింది. తను ఏరియా కమిటి కార్యదర్శి అయినా, డివిజనల్ కమిటి సభ్యురాలయినా, వయస్సు పెరుగుతున్నప్పటికీ జీవితాంతం తన తుపాకీని తానే శుభ్రం చేసుకునేది. చినిగిన బట్టలను తానే కుట్టుకునేది, పౌచ్‌లను, కిట్లను చాలావరకు తానే కుట్టుకునేది. చాలాకాలం పాటు కిచెన్ కోసం కట్టెలు తీసుకొచ్చేది. కిచెన్ పనుల్లో పాల్గొనేది.

1989లో జరిగిన సెంట్రల్ మిలిటరి క్యాంపు సన్నాహాల కోసం, నిర్వహణ కోసం కామ్రేడ్ రాంజీ నాయకత్వంలోని బలగాలు చాలా కష్టపడి పనిచేశాయి. ఆ టీములో ఒక సభ్యురాలిగా సృజన చురుగ్గా, కష్టపడి పనిచేసింది. ఆ క్యాంపును అత్యంత రహస్యంగా నిర్వహించాం. అందులో భాగంగా క్యాంపుకు అవసరమైన సరుకుల చేరవేత కూడా రహస్యంగానే జరిగేది. మన కామ్రేడ్స్ 6గంటలు ప్రయాణం చేసి సరుకులు వున్న చోటికి చేరుకోవడం, అక్కడ సర్దుకుని మూటలు కట్టుకుని, అన్నం తినడం కోసం ఒకటిన్నర రెండుగంటలు ఆగి తిరిగి 6-7 గంటల పాటు నడిచి ఒక్కొక్కరు 20-25కిలోల మూటలు సర్దుకుని క్యాంపుకు చేరుకునేవారు. ఈ రకంగా ఒక్కోసారి ఏకధాటిగా 15-16గంటల పాటు సామాన్ల చేరవేత కోసం మన బలగాలు కష్టపడేవి. ఇంతటి కష్టాన్ని సహించి పని చేయడంతో పాటు క్యాంపు పనులన్నింటిలో సృజన ఉత్సాహంగా పాల్గొనేది. విద్యార్థులతో పాటు గ్రౌండ్ ఐటమ్స్ నేర్చుకోవడానికి ప్రయత్నించేది. ఇలాగే మరెన్నో క్యాంపుల సన్నాహాల్లో, నిర్వహణలో సృజన పాల్గొని వాటిని విజయవంతం చేసింది.

జీవితాంతం ప్రజల కోసం పనిచేస్తూ, ప్రజలతో సజీవ సంబంధాల్ని, ఆత్మీయ సంబంధాల్ని

కలిగి వుండేది. ప్రజలను అంటిపెట్టుకుని వున్న ఫలితంగా ప్రజల కష్టసుఖాల గురించి, ప్రజల పోరాట సంసిద్ధత గురించి ఆమెకు స్పష్టత వుండేది. ఆమె ప్రజలతో తలలో నాలుకలా వ్యవహరిస్తూ ప్రియమైన, విశ్వసనీయమైన 'దీదీ'గా వారి అపార అభిమానాన్ని చూరగొంది.

కాడర్లతో కామ్రేడ్లీ సంబంధాలు, ఆత్మీయ సంబంధాలు కలిగి వుండేది. ప్రజలకు, కాడర్లకు, ముఖ్యంగా మహిళ కామ్రేడ్స్‌కు తమ కష్టసుఖాలు పంచుకునే ఆత్మీయురాలయిన "సృజనక్క" అయ్యింది.

జీవితాంతం పార్టీ, మిలిటరి, ఆర్థిక, నైతిక క్రమశిక్షణను పాటించి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు జీవనశైలిని ఆచరించింది.

గత 10 సంవత్సరాలుగా నడుంనొప్పి, మోకాలు నొప్పి, వెన్నులో గడ్డ, శారీరక బలహీనత వున్నా ఏనాడు ప్రత్యేక సౌకర్యాలు కోరుకోలేదు. ఎన్ని ఆరోగ్య సమస్యలున్న ప్రజలను అంటిపెట్టుకుని పనిచేసింది.

**ఉన్నత స్థాయి నాయకత్వ బాధ్యతలలో జరిపిన కృషి:**

కామ్రేడ్ సృజన 2009లో రీజినల్ కమిటీ సభ్యురాలుగా ఎన్నికై 2015 వరకు ఉద్యమాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేసింది. ఆ కాలంలోనే అంటే 2013లో ఎస్‌జడ్‌సీ రీజినల్ కమిటీ సభ్యులతో ముందుకు తెచ్చిన యూనిఫైడ్ కమాండ్‌ల నిర్మాణంలో కామ్రేడ్ సృజన భాగమై పశ్చిమ సబ్-జోనల్ యూనిఫైడ్ కమాండ్ బాధ్యతలు పంచుకుంది. డివిజనల్ కమిటీ సభ్యురాలుగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే ఉన్నత స్థాయి కమిటీలో భాగమై మాస్‌వర్క్ మిలటరీ వర్క్‌ను సమన్వయిస్తూ గడ్డు పరిస్థితులలో ఉద్యమాన్ని కాపాడడానికి ఎంతగానో కృషి చేసింది. 2013లో గడ్‌చిరోలీ ఉద్యమం ఎదుర్కొన్న నష్టాల నుండి గుణపాఠాలు తీసుకుంటూ ఎస్‌జడ్‌సీ అందించిన గైడెన్స్‌లో కమాండ్ పనిచేసింది. శత్రు దాడుల నుండి గెరిల్లాలను రక్షించుకోవడానికి ఎత్తుగడల మౌలిక నియమాలను తు.చ. తప్పకుండా పాటింపచేస్తూ మాసస్‌వర్క్‌లో నూతన పోరాట రూపాలను చేపట్టి కమాండ్ చేసిన కృషిలో సృజన సలిపిన కృషి ఉద్యమాభివృద్ధికి తోడ్పడింది.

**పార్టీ పాలసీల పరిరక్షణకు పాటుపడిన కార్యకర్త :**

మన పార్టీ రాజకీయ-మిలిటరి పంథా పట్ల, మన పార్టీ పాలసీల పట్ల సృజనకు స్పష్టమైన అవగాహన వుండేది. ప్రజా పోరాటాల్లో, స్థానిక నిర్మాణాల్లో, పార్టీ, పీఎల్‌జీఏ అంతరంగిక జీవితంలో మన పాలసీల అమలు కోసం కృషి చేయడమే కాకుండా వాటికి భిన్నమైన ఆచరణ కొనసాగితే దాన్ని మార్చుకోవాలని తన అభిప్రాయాలను సలహాలు-సూచనలుగా చెప్పేది, సమస్య తీవ్రతను బట్టి విమర్శ పెట్టేది.

ఉత్తర గఢ్‌చిరోలీ డివిజనల్ కమిటీ కార్యదర్శిగా వుండిన దివాకర్‌లో 2010 నాటికి స్వార్థం

పెరిగి, అన్యవర్గ ధోరణులు తీవ్ర స్థాయికి పెరిగి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం మొదలుపెట్టాడు. కామ్రేడ్ సృజన 2010లో టిప్రాగఢ్ ఏరియాకు ఇంఛార్జి డీవీసీఎమ్‌గా వెళ్లినప్పటి నుండి ఆయన ఆచరణను గమనించి అది పార్టీ పాలసీలకు భిన్నమైన పార్టీ వ్యతిరేక ఆచరణ అని గమనించింది. ప్రజల పట్ల, దళసభ్యుల పట్ల, ఏసీ సభ్యుల పట్ల, తనపట్ల ఆయన వ్యవహారం బ్యూరాక్రటిక్‌గా వుండేది, పితృస్వామ్య ధోరణితో మహిళ కామ్రేడ్స్ పట్ల వ్యవహరించేది, ఏరియాలో మనం చేయాల్సిన కార్యక్రమాల గురించి ఏసీలో చర్చించకుండానే, ఇంఛార్జి డీవీసీఎమ్‌గా వున్న తనతో చర్చించకుండా వ్యక్తిగత పని పద్ధతులతో నిర్ణయాలు చేసేవాడు. మోటారు సైకిళ్ళపై తిరిగేవాడు వీటన్నింటిని గమనించి తన తప్పులు మార్చుకోవాలని దివాకర్‌కు మొదట్లో సలహా ఇచ్చింది. అయినా అతను తన తప్పులను మార్చుకోకుండా సృజన పట్ల వివక్షపూరిత, అణచివేత విధానాన్ని అనుసరించాడు. అయినా తను ధైర్యంగా వుండి డీవీసీ సమావేశంలో ఆయనను సరిదిద్దడానికి విమర్శించింది. చివరికి ఆయన కార్యకలాపాలు పార్టీ నియమాలకు వ్యతిరేకంగా వున్నాయని, శత్రువుతో సంబంధాలున్నాయని గమనించి ఈ విషయాన్ని ఎస్‌జెడ్‌సీ, సీసీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. దివాకర్ అనుసరించిన పార్టీ వ్యతిరేక విధానాలపై జరిగిన ప్లీనంలో పార్టీని కాపడడానికి ఆయనపై క్రమశిక్షణ చర్య తీసుకోవాలని మాట్లాడింది.

2006 అక్టోబర్‌లో జరిగిన డీకే 4వ కాన్ఫరెన్స్‌లో నూతన కమిటి ఎన్నిక కోసం ప్రవేశ పెట్టిన ప్యానల్‌లో కొంతమందిలో ఉన్నత స్థాయి కమిటి సభ్యులకు వుండాల్సిన అర్హతలు లేవని ముఖ్యంగా పితృస్వామ్య ధోరణితో నైతిక పొరపాట్లు చేసిన వారిని ప్యానల్ నుండి తొలగించాలని కాన్ఫరెన్స్ ప్రతినిధిగా స్పష్టంగా తన అభిప్రాయాన్ని మాట్లాడింది. రాజకీయ, మిలిటరి, నిర్మాణ సమర్థతలతో పాటు నైతిక, సాంస్కృతిక విషయాల్లో కూడా కమ్యూనిస్టు విలువలు పాటించేవారే పై కమిటీలో వుండాలనే అవగాహనతో పార్టీ ప్రయోజనాల కోసం కమిటి ఎన్నికపై తన అభిప్రాయాలను మహాసభలో మాట్లాడింది.

కొన్నిసార్లు ఏరియా కమిటీ కామ్రేడ్స్ ప్రజల మధ్య వైరుధ్యాలను పరిష్కరించడంలో భాగంగా ప్రజా పంచాయతీలు చేసి కొందరిపై వారి ఆర్థిక స్థాయికి మించిన దండుగలు వేసినపుడు వర్గ పంథాననుసరించి ఆర్థిక స్థాయిని మించిన దండుగలు వేయకూడదని అలా చేస్తే ప్రజల్లో మనపై వ్యతిరేకత పెరుగుతుందని నచ్చచెప్పి అలాంటి తప్పులను సరిదిద్దేది.

కసన్‌సూర్ ఏరియాలో తన బంధువైన గ్రామ గైతని కొడుకు తనను తన ఇంటికి భోజనానికి పిలిచాడు. బంధువయినందుకు తనకు కోడికూర ఏర్పాటు చేశానని, తమ ఇంటికి వచ్చి తిని వెళ్లాలని కోరాడు. కానీ విడిగా వెళ్లి, ప్రత్యేక వంటకాలు తిని రావడం పార్టీ పద్ధతి కాదని, తనకోసం చేసిన కూర దళం వద్దకే తీసుకువస్తే తను, తన దళసభ్యులం అందరం కలిసి తింటామని

ఆయన ప్రతిపాదనను ఆమోదించలేదు. తర్వాత తేలిన ప్రకారం వాడు పోలీసు ఇన్‌ఫార్మరని, సృజనను తిండికోసం పిలిచి పోలీసులకు అప్పగించాలని ప్లాన్ చేశాడని అర్థమైంది. ఏ విషయంలోనైనా పార్టీ పద్ధతులను పాటించాలనే నియమాలను పాటించిన ఫలితంగా ఆ ఉచ్చులో ఇరుకకుండా తను తప్పుకోగలిగింది.

ఈ రకంగా తనను వ్యక్తిగతంగా తిండికి పిలిచే విషయమైన, ప్రజా పంచాయతిలు అయిన, పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే వారి విషయమైన, కమిటి ఎన్నికయిన, ఇతరత్ర మరెన్నో విషయాలలో కామ్రేడ్ సృజన పార్టీ పాలసీల పరిరక్షణ కోసం పాటుపడింది. పార్టీ పాలసీల పరిరక్షణ కోసం పాటుపడే సృజన లాంటి కామ్రేడ్స్ వున్నపుడు పార్టీని నష్టపోకుండా పురోగమించడానికి హామి వుంటుంది.

**కామ్రేడ్ సృజన ఆదర్శాలను అనుసరిద్దాం, విప్లవోద్యమంలో దృఢంగా పురోగమిద్దాం :**

32 ఏళ్ల విప్లవ జీవితపు సృజన జీవితం, ఆచరణ మనందరికీ ఆదర్శం, అనుసరణీయం, ప్రేరణదాయకం. ఆమె దీర్ఘకాలం ఎలాంటి ఊగిసలాట లేకుండా, ధైర్యంగా పనిచేసింది. 'జీవితాంతం ప్రజల కోసం పనిచేస్తాననే' పార్టీ సభ్యురాలిగా తను చేసిన ప్రతినపై నిలబడి ప్రజల కోసం తన జీవితాన్ని అర్పించింది. శత్రు సరెండర్ పథకాల్ని కాలదన్ని ప్రజల కోసం దృఢంగా పనిచేసింది. నిరంతర శత్రుదాడుల మధ్య ముఖ్యంగా 1991 నుండి 2020 వరకు గడిచిన 27 ఏళ్లుగా శత్రుదాడుల మధ్య, ప్రతికూలతల మధ్య 2005 నుండి కార్పెట్ సెక్యూరిటి మధ్య మాస్‌వర్క్ చేసింది. ప్రతి సంవత్సరం పోలీసు దాడులు–కాల్పులు, ఎన్‌కౌంటర్లు జరిగినా, చావుకు వెరవని సాహసిక గెరిల్లాగా ప్రజాయుద్ధ పథంలో పురోగమించింది. శత్రుదాడుల రీత్యా ప్రజా నిర్మాణాలు దెబ్బతింటే, బలహీన పడితే వాటిని అలుపెరగక పునర్నిర్మాణం చేస్తూ, బలోపేతం చేస్తూ వచ్చింది. పరిస్థితుల్లోని మార్పులకు తగినట్టుగా ఇల్లీగల్ నిర్మాణాలతో పాటు లీగల్ నిర్మాణాలను నిర్మించి పని చేయించింది. నవతరాన్ని రైతాంగేతర సెక్షన్లను ప్రజా నిర్మాణాల్లో సంఘటితం చేసి సమర్థవంతమైన ఆర్గనైజర్‌గా ఎదిగింది. పార్టీ ఏ పని అప్పగించినా అది మాస్‌వర్క్ అయినా, మిలిటరి వర్క్ అయినా, ఏ ప్రాంతానికి పంపినా వెనకాడకుండా పని చేసింది. ఉద్యమ అవసరాల రీత్యా ఆమె అహెరీ నుండి పర్సవాడ బాలాఘాట్ వరకు, మాడ్–ఉత్తరబస్తర్ వరకు వెళ్లి పనిచేసింది. గత 10 సంవత్సరాలుగా నడుంనొప్పి, మోకాలు నొప్పి, వెన్నులో గడ్డ, శారీరక బలహీనత వున్న ఏనాడు ప్రత్యేక సౌకర్యాలు కోరుకోలేదు. అనారోగ్య కారణంతో ఏరియాలకు దూరంగా వుండకుండా, నిరంతరం ప్రజలను అంటిపెట్టుకుని పనిచేసింది. ప్రజలతో, కాడర్లతో ఆత్మీయ సంబంధాలు కలిగివుండేది. పార్టీ పాలసీల పరిరక్షణ కోసం పాటుపడింది. ఆర్థిక దుబారకు పాల్పడకుండా, ఆడంబరాలకు పోకుండా కమ్యూనిస్టు విలువలను ఆచరించి సీదాసాదా జీవనాన్ని గడిపింది.

ఇపుడు ఆమె భౌతికంగా మన మధ్యలేదు. కానీ ఆమె విప్లవాచరణ, ఆదర్శాలు మనకు వున్నాయి. సృజన అమరత్వాన్ని ఎత్తిపడదాం. ఆమె చేసిన విప్లవోద్యమ నిర్మాణ కృషిని ప్రజల్లో, కాడర్లలో విస్తృతంగా ప్రచారం చేద్దాం. ఇప్పటికి తెగ పితృస్వామ్యపు పీడనను, అణచివేతను ఎదుర్కొంటున్న మహిళలను తనలాంటి విప్లవకారులుగా మలచుకుందాం. తెగ పితృస్వామ్యానికి, పార్టీలోని పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుదాం. ఆమె ఆదర్శాలను ప్రజల్లో, కాడర్లలో ప్రచారం చేసి తనలాంటి విప్లవకారులను తయారుచేద్దాం. తన ఆదర్శాలను అనుసరించి, ఆచరిద్దాం. నేటి గడ్డుస్థితిని అధిగమించడం కోసం తనలాగా అలుపెరగక, దృఢంగా, సాహసోపేతంగా విప్లవోద్యమ పురోగమనం కోసం కృషి చేద్దాం. శతృదాడిని ఓడిద్దాం. ఆమె ఆశయసాధన కోసం సామ్రాజ్యవాదాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారి విధానాన్ని, భూస్వామ్యాన్ని కూలదోసి నూతన ప్రజాస్వామిక భారతావనిని నిర్మిద్దాం.

☆ **కామ్రేడ్ సృజన అమర్ రహే.**

☆ **కామ్రేడ్ సృజన ఆశయసాధన కోసం పోరాడుదాం.**

☆ **నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.**

**విప్లవాభినందనాలతో,**
**పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో,**
**గఢ్‌చిరోలీ,**
**సీపీఐ (మావోయిస్టు).**

**13.06.2020.**